
సాక్షి
ఒడిశా

ఆదివారం । 21 । జనవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 4,96,524
బంగారం	250 మిల్లీ గ్రాములు
వెండి	59 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



అలరించిన నృత్యం..

పర్లాకిమిడిలో నిర్వహించిన నృత్య మహోత్సవం అలరించింది. నాట్యకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. - 8లో



ప్రాజెక్టులకు శంకుస్థాపన

19 అంతర్ నదీ జలాశయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగింది. సీఎం నవీన్ పట్నాయక్ పాల్గొన్నారు. - 8లో


విజ్ఞాన మేళా


వ్యవసాయ ప్రాజెక్టు


రోడ్డు సేఫ్టీ ప్రాజెక్టు

● ఆకట్టుకున్న విజ్ఞానమేళా

బరంపురంలోని డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విజ్ఞాన మేళా ఆకట్టుకుంటోంది. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 150 రకాల ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. డీఈఓ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మోహన్‌రావు తదితరులు సందర్శించి ప్రాజెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. – బరంపురం

న్యూస్‌రీల్

మిసెస్ ఇండియాకు సత్కారం


ఇసాంక సాహును సత్కరిస్తున్న మేయర్ సంఘమిత్ర దొళాయి

బరంపురం: బరంపురం నగరానికి చెందిన ఇసాంక సాహు ఇటీవల ఢిల్లీలో జరిగిన మిసెస్ ఇండియా క్వీన్ ఆఫ్ ఆర్ట్స్ ఓషన్స్–2024 విజేతగా నిలిచి కిరీటాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సృజని సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ధర్మానగర్ మెయిన్‌రోడ్డులోని ఓ హోటల్లో సన్మాన సభ ఏర్పాటు చేశారు. నగర మేయర్ సంఘమిత్ర దొళాయి ముఖ్య అతిథిగా పాల్గొని ఇసాంక సాహును సత్కరించారు. కార్యక్రమంలో సృజని సంస్థ చైర్మన్ సుశాంత్ సభత్, బరంపురం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పర్లాకిమిడిలో పవర్ కట్

పర్లాకిమిడి: పవర్ గ్రిడ్‌లో వార్షిక ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ వల్ల ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈమేరకు టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ ఇంజినీర్ తెలిపారు.

గజమోహన్‌కు ఘన నివాళులు


మోహన్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రాయగడ: ప్రముఖ ఒడియా టీవీ ఛానల్ జిల్లా ప్రతినిధి గజమోహన్ గొరొడియా (36) అకాల మరణానికి చింతిస్తూ స్థానిక ప్రముఖులు, రాజకీయ నాయకులు, జిల్లా అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా సంస్కృతి భవనంలో నిర్వహించిన సంతాప సభలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, స్థానిక ప్రముఖులు డి.కె.మహంతి, శక్తి పాణిగ్రాహి, మిలాన్ లెంక, తన్మయ్ మహారాణ తదితరులు పాల్గొన్నారు. ముందుగా మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అతి చిన్న వయసులో గుండెపోటుతో మృతి చెందిన మోహన్ కుటుంబాన్ని ఆదుకోవాలని నెక్కంటి భాస్కరరరావు కోరారు.

భర్త చేతిలో భార్య హతం


దనేయి మృతదేహం


నిందితుడు మంగళ ముదిలి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి మాడ్కపోదర్ పంచాయతీ సింధిగూఢ గ్రామంలో శనివారం మంగళ ముదిలి ఆయన భర్య దనేయి ముదిలిని హత్య చేశాడు. ఉదయం భార్యా భర్తలు గొడవపడ్డారు. కాసేపటి తర్వాత మంగళ తాగి ఇంటికి వచ్చి దనేయిని కత్తితో పొడిచాడు. ఆమె చావు కేకలు విన్న ఇరుగు పొరుగు వారు వచ్చి చూడగా అప్పటికే ఊపిరి ఆగిపోయింది. వెంటనే వారు మత్తిలి పోలీసులకు సమాచారం అందజేశారు. వారు వచ్చి మంగళి ముదిలిని అరెస్టు చేశారు. మృతదేహాన్ని మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సన్నదురాల్ గ్రామంలోని దనేయి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మత్తిలి ఐఐసి దేవ్‌దత్త మాల్లిక్ కేసు నమోదు చేశారు.

రాత్రిపూట.. జంగిల్ సఫారీ

- చందక వన్యప్రాణుల అభయారణ్యంలో ఏర్పాట్లు
- ఈ నెల 29 నుంచి ప్రయోగాత్మకంగా అమలు


చందకా - డంపడా అభయారణ్యం ప్రధాన ప్రవేశ ద్వారం

భువనేశ్వర్: ఇప్పటి వరకు పగటి పూటకే పరిమితమైన జంగిల్ సఫారీ తొలిసారిగా రాత్రిపూట కూడా అమల్లోకి రానుంది. భువనేశ్వర్ నగర సమీపంలోని చందక – డంపడా వన్యప్రాణుల అభయారణ్యంలో భరత్‌పూర్ సెక్షన్‌లో ఈ నెల 29 నుంచి రాత్రి సందర్శన ప్రవేశపెట్టేందుకు అటవీ శాఖ సర్వం సిద్ధం చేసింది. జంగిల్ సఫారీ వాహనాల్లో అటవీ ప్రాంతంలో రాత్రి 9.30 గంటల వరకు పర్యటిస్తు జింకలు, తోడేళ్లు, ఏనుగులు వంటి అనేక వన్యప్రాణులను చూడవచ్చు. సాధారణ పర్యాటకులతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, ప్రకృతి ప్రియులకు రాత్రి పూట అభయారణ్యం సందర్శన తొలిసారిగా అనుభవంలోకి రానుంది.

ప్రయోగాత్మకం..

ఈ నెల 29 నుంచి ప్రయోగాత్మకంగా ఈ పర్యటన అమలు చేయనున్నారు. ఇది విజయవంతమైతే క్రమబద్ధీకరించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తారు. నిత్యం రాత్రి 9.30 గంటల వరకు సందర్శకులను అనుమతిస్తారు. సందర్శకులకు, ముఖ్యంగా విద్యార్థులకు, పరిశోధకులకు రాత్రి సమయంలో అడవిలో వన్యప్రాణుల పరస్పర చర్యపై భారీ అభ్యాస అనుభూతిని కలిగిస్తుందని ప్రధాన అటవీ సంరక్షకుడు (వన్యప్రాణులు) సుశాంత నంద వివరించారు. యువత స్థానిక మొక్కలు, వన్యప్రాణుల జాతులు చీకటి వేళలో కదలికలు తెలుసుకునేందుకు వీలవుతుంది. 194 చ.కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉన్న చందక – డంపడా అభయారణ్యంలో వివిధ రకాల వన్య ప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తుంటాయి.

టికెట్ బుకింగు వేళలు..

రాత్రి పూట చందకా – డంపడా అభయారణ్యం రాత్రి పూట సందర్శనకు టికెట్లు సాయంత్రం నుంచి విక్రయిస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఇలా టికెట్లు బుక్ చేసుకున్న సందర్శకులు రాత్రి 9.30 గంటల వరకు అభయారణ్యంలో తిరిగేందుకు అనుమతిస్తారు. పర్యాటకులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని పీసీసీఎఫ్ సుశాంత్ నందా తెలిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల మధ్య ప్రతి గంటకో బ్యాచ్‌ని సందర్శనకు తీసుకుని వెళ్లేందుకు వాహన సౌకర్యం కల్పిస్తారు.

భరత్‌పూర్ సరిహద్దుల్లో మాత్రమే..

ఈ సౌకర్యం చందకా అభయారణ్యంలో భాగమైన భరత్‌పూర్ అడవులలో మాత్రమే అందుబాటులో ఉంటుందని డీఎఫ్‌వో శరత్ కుమార్ బెహరా తెలిపారు. పర్యాటకుల సందర్శన కోసం 2 వర్గాల వాహనాలు వినియోగిస్తారు. 8, 12 సీట్లతో కూడిన వాహనాల్ని వినియోగిస్తారు. పర్యాటకులు 8 సీట్ల క్యారేజీకి రూ.1,500, అదే విధంగా12 సీట్ల క్యారేజీకి రూ.2,000 చెల్లించాల్సి ఉంటుంది. భరత్‌పూర్ అటవీ ప్రాంతం పరిసరాల గుండా ఈ వాహనాల్లో పర్యాటకుల్ని తిప్పుతారు. అయితే అభయారణ్యం ప్రధాన ప్రాంతానికి మాత్రం తీసుకెళ్లరు. గంట వ్యవధిలో అడవి లోపల దాదాపు 15 కిలో మీటర్లు పర్యటించేందుకు వీలవుతుంది. వన్యప్రాణులను ప్రభావితం చేయని విధంగా వాహనాల రవాణా పట్ల జాగ్రత్త వహిస్తారు. సందర్శన మార్గంలో ప్రతి 3 కిలో మీటర్ల దూరంలో ఒక్కో టవర్ ఉంటుంది. ఇలా 4 టవర్ల నుంచి అటవీశాఖ అధికారులు సందర్శకుల ప్రతి కదలికలను పర్యవేక్షిస్తారు. 2 వాహనాల్లో అటవీ సిబ్బంది పర్యాటకుల వాహనాల వెంబడి ఉంటూ భద్రత, రక్షణ చర్యల్ని పర్యవేక్షిస్తారు. ఈ వాహనాల్ని నెమ్మదిగా ముందుకు నడుపుతారు.

వన్య ప్రాణులప్రియులకు వరం..

ఒడిషా వ్యవసాయ సాంకేతిక విశ్వవిద్యాలయం (ఓయూఏటీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ (ఐఎల్‌ఎస్), భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ), జాతీయ విజ్ఞాన బోధన, పరిశోధన సంస్థ (నైజర్) ఇతర పరిశోధకులకు రాత్రి పూట వన్య ప్రాణుల సంచారం, పలు రకాల కదలికల్ని ప్రత్యక్షంగా తిలకించి లోతుగా పరిశోధించేందుకు ఉపకరిస్తుందని చందక డీఎఫ్‌వో మహ్మద్ జమీల్ తెలిపారు.

నైట్ నేచర్ ట్రైల్..

అభయారణ్యంలో భరత్‌పూర్, గొడిబాడి, డేరాస్, డంపడాలో పగటి పూట జంగిల్ సఫారీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 7 నుంచి 10.30 గంటల మధ్య 3 షిఫ్టులు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.15 గంటల మధ్య 2 షిఫ్టులలో జంగిల్ సఫారీ సందర్శన వేళలుగా ప్రకటించారు. నిత్యం సగటున 2,000 మంది సదర్శకులు అభయారణ్యంలో తిరుగుతూ సహజ అటవీ వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. పర్యాటకుల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని రాత్రి అటవీ సందర్శన (నైట్ నేచర్ ట్రైల్) ప్రారంభించనున్నారు. పగటిపూట ఈ అవకాశం పొందలేని వారు సాయంత్రం అభయారణ్యం సందర్శించేందుకు వీలవుతుంది.

జయపురం–పూరీ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం


జయపురం బస్టాండ్ నుంచి బయల్దేరిన జయపురం–పూరీ శ్రీజగన్నాథ్ ఎక్స్‌ప్రెస్

జయపురం: జయపురం నుంచి పూరీకి పూరీ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభమైంది. ప్రభుత్వం ప్రతి జిల్లాలోని ప్రధాన పట్టణం నుంచి శ్రీక్షేత్రం పూరీకి శ్రీజగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సును వేసింది. ఆయా బస్సులను రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా జయపురంలో జరిగిన జయపురం–పూరీ శ్రీజగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభోత్సవంలో కొరాపుట్ కలెక్టర్ అబదూల్ మహమ్మద్ అక్తార్ జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మిణీ దియాన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ పడాల్, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర చంద్ర పాణిగ్రహి, జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పటాన్నాయిక్ తదితరులు పాల్గొన్నారు. సమాచార ప్రజా సంబంధాల అధికారి మనోజ్ కుమార్ నాయిక్ శ్రీజగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సులను నడిపే ప్రాధాన్యతను వివరించారు. బస్సుల్లో పయనించేవారు జయపురంలో టిక్కెట్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని తెలిపారు. అలాగే కొరాపుట్, రాయగడలలో టికెట్లు బుకింగ్‌లలో తీసుకోవాలని జయపురం ఏటీఎం శ్రీనివాస పాణిగ్రహి తెలియజేశారు. టికెట్ ధర రూ.1400 ఉంటుందని, మహిళలకు 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. 50 సీట్లు గల శ్రీజగన్నాథ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజూ ఈ సర్వీసు ఉంటుందన్నారు. జయపురం -పూరీ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకు పుర ప్రముఖులు, పలువురు జిల్లా స్థాయి అధికారులు వచ్చారు. ఇక్కడ రాత్రి 7 గంటలకు బస్సు బయల్దేరుతుంది.

కొత్త పద్ధతిలో అడవుల పెంపకం



మొకాపుట్‌లో నెలకొల్పిన మియావాకి ఫారెస్టు

జయపురం: కొరాపుట్‌లో కొత్త అడవులు పురుడు పోసుకుంటున్నాయి. ఒకప్పుడు మెండుగా ఉన్న అడవులు తర్వాత తగ్గిపోయాయి. అడవులు పెంచేందుకు ఫారెస్టు విభాగం వనోత్సవాలు పేరుతో అనేక మొక్కలు నాటుతోంది. అయినా ఫలితం కనిపించడం లేదు. దీంతో జయపురం అటవీ విభాగం వారు రెండేళ్ల కిందట జపాన్ పద్ధతిలో అడవులను పెంచే నూతన పద్ధతికి శ్రీకారం చుట్టి మంచి ఫలితాలు సాధించారు. జయపురం సమితి మొకాపుట్ ప్రాంతంలో జపాన్‌కు చెందిన మియావాకీ ఫారెస్టు కంపెనీ వారు ఈ పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఒక మీటరు పొడవు, ఒక మీటర్ వెడల్పులో ఒక మొక్క చొప్పున రెండున్నర ఎకరాల్లో ఔషధ, ఫల, పూల, తదితర మొక్కలు 8వేల వరకు నాటారు. రాకపోకలకు వీలుగా నాలుగు వైపులా రోడ్డు ఏర్పాటు చేశారు. జపాన్ పద్ధతిలో మొకాపుట్‌లో 2021–22 ఆర్థిక సంవత్సరంలో నాటిన ఆ మొక్కలు పెద్దవయ్యాయి. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటి దట్టమైన అడవులు పెంచేందుకు జపానీ మియావాకీ పద్ధతిని అనుసరించామని అటవీ విభాగ అధికారి సచ్చిదానంద పారిడ వెల్లడించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన జపాన్ పద్ధతిలో చంపంగి, చందన, దేవదారు, జీడిమామిడి, కెందు, వేప, నిమ్మ, పనస, నేరెడి మొదలగు 90 రకాల మొక్కలు 8 వేలు నాటామని, రెండేళ్లలో అవి పెరిగి దట్టమైన అడవి ఏర్పడిందని, దీని వల్ల పర్యావరణం బాగు పడిందని తెలిపారు. మొకాపుట్ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన జపాన్ మియావాకీ ఫారెస్టు పద్ధతి విజయవంతం కావటంతో ఈ పద్ధతిని ఇంతర ప్రాంతాల్లో కూడా అమలు చేసి దట్టమైన పెద్ద అడవులు పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.


రెండేళ్లలో బాగా పెరిగి దట్టమైన అడవిగా మారిన మియావాకి అడవి

8 మంది జూదరుల అరెస్టు


టౌన్ పోలీసులు జూదం అడ్డాలో స్వాధీనం చేసుకున్న నగదు,మొబైళ్లు

బరంపురం : నగర నడిఒడ్డున గల పాత బస్టాండ్ వద్ద జూదం ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.68,700 నగదు, 6 వాహనాలు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఐఐసి అధికారి సురేష్ కుమార్ త్రిపాఠీ అందించిన సమాచారం ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి బరంపురం పోలీసు జిల్లా ఆధీనంలో గల టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న పాత బస్టాండ్ దగ్గర ఉన్న ఒక ఇంటిలో రహస్యంగా జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బరంపురం ఎస్పీ శర్వాణ్ వివేక్ ఆదేశాలతో టౌన్ పోలీసులు దాడి చేసి 8 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.68,700 నగదు, 6 వాహనాలు సీజ్ చేసి 5 మొబైళ్లు, 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

సీతారామాంజనేయ ఆలయంలో ఘనంగా పూజలు


పురవీధుల్లో సీతారాములను ఊరేగిస్తున్న భక్తులు


మందిరంలో పూజలు అందుకుంటున్న శ్రీసీతారామాంజనేయ స్వామి


సీతారాముల పల్లకిని మోస్తున్న వృద్ధురాలు

జయపురం: అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్టాపన ఉత్సవాలు సందర్భంగా జయపురం శ్రీరామమందిర లైన్(జమాల్‌లైన్) లో గల శ్రీసీతారామాంజనేయ మందిరంలో నాలుగు రోజులుగా ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. నవమి సందర్భంగా శుక్రవారం వినాయక పూజ, కలశ స్థాపన, అఖండ దీపారాధన, శ్రీరామచంద్రమూర్తికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శనివారం ఉదయం 6.30 గంటలకు వినాయక పూజ, శ్రీఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, వెయ్యి తమలపాకులతో సిందూరార్పణ పూజలు నిర్వహించారు. అనంతరం సీతా రాముల ఉత్సవ విగ్రహాలను అందమైన పల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవునా శ్రీరామ చంద్రుని ప్రజలు భక్తితో పూజలు జరిపారు. ఒక వృద్ధ మహిళ శ్రీరామ, సీతా,లక్ష్మణులు విగ్రహాల పల్లకిని నెత్తిన పెట్టుకొని పురవీధి ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నేడు ఆలయంలో కూడా పెద్ద ఎత్తున భక్తులు వచ్చి సీతారాములకు పూజలు జరిపారు. ఈ సందర్భంగా శ్రీసీతా రామాంజనేయ మందిర కమిటీ అధ్యక్షుడు గోరపల్లి నాగరాజు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరామమందిర ప్రతిష్టాపన ఉత్సవాల సందర్భంగా తమ కమిటీ ఈ పూజలు, కార్యక్రమాలు నిర్వహిస్తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 22 వ తేదీ సోమవారం శ్రీసీతారామ కల్యాణం, శ్రీరామ గాయిత్రీ హోమం, శ్రీరామ సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణాలతో ముగుస్తాయని వెల్లడించారు. కమిటీ కార్యదర్శి సానా జగదీష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. పూజా కార్యక్రమాలను జయపురం పట్టణ పురోహితులు గన్నవరపు వెంకటరమణారావు, ఆలయ అర్చకులు ఉలిమిరి నాగేశ్వరరావులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే జయనారాయణ మహంతి మృతి



జయనారాయణ మహంతి

భువనేశ్వర్: మాజీ ఎమ్మెల్యే జయనారాయణ మహంతి (74) శనివారం కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బాలాసోర్ జిల్లా జలేశ్వర్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత ఏడాది డిసెంబర్ నెలలో చికిత్స కోసం స్థానిక ఎయిమ్స్‌లో చేరారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన బలమైన కాంగ్రెస్ నేత. 1995, 2000 అసెంబ్లీ ఎన్నికలలో వరుసగా 2 సార్లు జలేశ్వర్ నుంచి రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తదుపరి 2019 సంవత్సరంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. జలేశ్వర్ నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే జయ నారాయణ మహంతి మృతిపై రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మత్తుతో యువత చిత్తు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బాగ్

రాయగడ: మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోవద్దని వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్ అన్నారు. సదరు సమితి హలువ పంచాయతీలో ఉత్కళ మీడియా పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మత్తువీడాలి-యువత లేవాలి అన్న అంశంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రచార రథం ఏర్పాటు చేశారు. దీనిని బాగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్కళ మీడియా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు దయానిధి ఖడంగా, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, హలువా పంచాయతీ సర్పంచు తమ్మారావు బిడిక తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి



ప్రసంగిస్తున్న ప్రకాష్ మహంతి

కొరాపుట్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క ఓటు పట్ల కూడా నిర్లక్ష్యం వహించకుండా విజయమే లక్ష్యంగా పోరాడాలని బీజూ జనతా దళ్ పార్టీ రాష్ట్ర స్థాయి సంస్థాగత సీనియర్ నాయకుడు ప్రకాష్ మహంతి పిలుపునిచ్చారు. శనివారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ నియోజకవర్గం ఖర్గి డ్యాం ప్రాంతంలో జరిగిన పార్టీ బంధు మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వరుసగా ఐదుసార్లు ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ గెలుపొందారని, ఆరో విడత గెలుపునకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నబరంగ్‌పూర్ జిల్లాలో నాలుగు విధాన సభ, పార్లమెంటరీ స్థానంలో గెలవాలన్నారు. సమావేశంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ మజ్జి, కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, కో అబ్జర్వర్ దేవాశిష్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రానికి గుర్తు తెలియని మహిళ



సంరక్షణ కేంద్రంలో మహిళ

కొరాపుట్: గుర్తు తెలియని అభాగ్యురాలిని అధికారులు సంరక్షించారు. శనివారం కొరాపుట్ జిల్లా నందపూర్‌కు ఖరీదైన దుస్తులు ధరించి ఆంగ్లం, తెలుగు, హిందీ భాషల్లో తనలో తాను మాట్లాడుకుంటూ ఓ మహిళ వచ్చింది. స్థానికులు ఈ విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు చేరుకుని జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అనంతరం మహిళా శిశు సంరక్షణ అధికారులు నందపూర్ చేరుకుని మహిళను కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఆమె వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

వసంతరావుకు లయన్స్ గోల్డెన్ ప్రెసిడెంట్ అవార్డు



జయపురం: కొరాపుట్ జిల్లాలో ప్రముఖ వ్యాపారి, జయపురం లయన్స్ క్లబ్ సభ్యుడు గెంబలి వసంతరావుకు లయన్స్ గోల్డెన్ ప్రెసిడెంట్ గౌరవం లభించింది. శనివారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ లయన్స్ భవనంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు బహూకరించి సన్మానించారు.

అలరించిన నృత్య మహోత్సవం



జాతీయ పరలా నృత్య మహోత్సవాలను ప్రారంభిస్తున్న ఒడిస్సీ గురువు గజేంద్ర పండా



పశ్చిమబెంగాల్ నృత్యకళాకారిణి ప్రీతీ పాల్‌ను సన్మానిస్తున్న గజేంద్రపండా, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో శనివారం సాయంత్రం నిర్వహించిన మూడో జాతీయ పరలా నృత్య మహోత్సవం అబ్బురపరిచింది. ఒడిస్సీ నృత్యకళాకారులు గురు గజేంద్ర పండా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు, క్రియేటివ్ ఆర్ట్స్ అధ్యక్షుడు నృసింహ చరణ్ పట్నాయక్, నృత్యకారిణి డి.ప్రియాంగ, అంజలి మహంతిలు అతిథులుగా విచ్చేశారు. శ్రీజగన్నాథ ఒడిస్సీ కళా కేంద్రం, జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ నృత్య మహోత్సవంలో పలువురు ఒడిస్సీ కళాకారులతో పాటు పశ్చిమ బెంగాళ్ నుంచి విచ్చేసిన నర్తకి ప్రీతీ పాల్‌ను గురు గజేంద్రపండా, సంగీత దర్శకులు రఘునాథ పాత్రోలు దుశ్శాలువతో సన్మానించారు. త్రిధాన నృత్యసంస్థ (భువనేశ్వర్) ఆధ్వర్యంలో ఒడిస్సీ నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పర్లాకిమిడిలో నృత్య శిక్షకురాలు డి.ప్రియాంకను సత్కరించారు. ఆదర్శదాస్ ముఖ్య అతిథిగా వ్యవహరించారు.



ఆకట్టుకున్న ఒడిస్సీ నృత్యం



ఒడిస్సీ నృత్యకళాకారిణి డి.ప్రియాంకకు సన్మానం



గురుమణి డి.ప్రియాంకకు విద్యార్థుల సత్కారం

విద్యతోనే వికాసం

- కేంద్ర ఆదివాసీ సంక్షేమ శాఖ మంత్రి విశ్వేశ్వర్ టుడు
- రు.20 కోట్లతో ఏకలవ్య ఆదర్శ విద్యాలయానికి భూమిపూజ



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి విశ్వేశ్వర టుడు

రాయగడ: ఆదివాసీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని కేంద్ర ఆదివాసీ సంక్షేమ, జలవనరుల శాఖల మంత్రి విశ్వేశ్వర్ టుడు అన్నారు. జిల్లాలోని కాసీపూర్‌లో సుమారు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఏకలవ్య ఆదివాసీ ఆదర్శ విద్యాలయానికి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రతి సమితి కేంద్రంలో విద్యా వికాసానికి ఏకలవ్య ఆదర్శ విద్యాలయాలను ఏర్పాటు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా కాసీపూర్ వంటి వెనుకబడిన ప్రాంతంలో ఏకలవ్య ఆదర్శ విద్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ విద్యాలయం ప్రారంభమైతే సుమారు 360 మంది విద్యార్థులు ఆరు నుంచి 12వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంటుందన్నారు.

ఫలించిన కల..

అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన కాసీపూర్‌లో ఏకలవ్య ఆదర్శ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు ఎన్నోసార్లు విన్నవించుకున్నారని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. నేడు ఆ కల సాకారం కావడం ఆనందంగా ఉందన్నారు. కాసీపూర్ గత పదేళ్లలో ఎంతగానో అభివృద్ధి చెందిందని చెప్పారు. అయితే సరైన రహదారులు లేక విద్య, వైద్యరంగాల్లో మాత్రం ఇంకా వెనుకబాటులోనే ఉందన్నారు. తక్షణమే రహదారుల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జుయెల్ ఒరాం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, బీజేపీ ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాలీరాం మాఝి తదితరులు పాల్గొన్నారు.

70 కిలోల గంజాయి పట్టివేత



మత్తిలి పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు



40 కిలోల గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: మత్తిలి పోలీసులు రెండు వేర్వేరు ప్రాంతాల్లో 70 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ముండగూడ గ్రామంలో ఔట్‌పోస్టు పోలీసులు శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 30 కిలోల గంజాయిని పట్టుకున్నారు. విచారణలో నిందితుడి పేరు వైద్యనాద్ రాజ్‌గండ్ అని తెలిసింది. ఇతను నవరంగ్‌పూర్ జిల్లా కసుమ్ గ్రామానికి చెందిన వాడు. అలాగే గోలీందపల్లి ఘట్టిలో కూడా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 40 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇక్కడ నిందితుడు బలిమెల గ్రామానికి చెందిన మాధవ్ ఫటా కాగా తెలిసింది. వీరిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఎమ్మెల్యే అభ్యర్థి మార్పుపై సమీక్ష



గోపాల్‌పూర్ బీజేడీ మహిళా నాయకులతో సమీక్షించిన టి-5 కార్యదర్శి కార్తికేయ పాండ్యన్

బరంపురం : గోపాల్‌పూర్ ఐవీలో టి-5 కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ అధికార పార్టీ బీజేడీ జిల్లా నాయకులతో శుక్రవారం రాత్రి సమీక్షించారు. ప్రస్తుత బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండాను గోపాల్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా 2024 ఎన్నికల్లో పోటీ చేయించేందుకు నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.

ప్రస్తుతం గోపాల్‌పూర్ ఎమ్మెల్యే ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహిపై అవినీతి ఆరోపణలు ఉండడంతో బీజేడీ బహిష్కరించింది. దీంతో బరంపురం ఎమ్మెల్యేను ఇక్కడ పోటీకి దించడానికి పార్టీ సన్నాహాలు చేస్తోంది.

బరంపురం మాజీ ఎంపీ అనాది చరణ్ సాహు కన్నుమూత



అనాది చరణ్ సాహు సంతాప సభలో మౌనం పాటించిన పోలీసు అధికారులు



శ్రద్ధాంజలి ఘటించిన రాష్ట్ర డీజీపీ (ఇన్‌చార్జి) అరుణ్ కుమార్ షడంగి

భువనేశ్వర్: బరంపురం పార్లమెంటు మాజీ సభ్యుడు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అనాది చరణ్ సాహు (83) కటక్ నగరంలో తన నివాసంలో కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం కటక్ సీడీఏ ప్రాంతంలోని తన ఇంటిలో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన పదవీ విరమణ తర్వాత క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1999లో బరంపురం నియోజక వర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి 6వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఐపీఎస్ అధికారిగా రాష్ట్రపతి పోలీసు పతకం, విశిష్ట సేవా పతకం అందుకున్నారు. సమర్థుడైన పోలీసు అధికారిగానే కాకుండా, అతను ప్రఖ్యాత సాహితీవేత్తగా కూడా పేరు పొందారు. కటక్‌లోని సతీచౌర శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

మాజీ పార్లమెంటు సభ్యుడు అనాది చరణ్ సాహు మృతిపై రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ విచారం వ్యక్తం చేశారు. మృతి వార్త విని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బాధపడ్డారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సానుభూతి తెలిపారు.

రాష్ట్ర పోలీసు సంతాపం

రాష్ట్ర మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఐపీఎస్ అధికారి అనాది చరణ్ సాహు మృతిపై ఒడిషా పోలీసులు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనాది చరణ్ సాహును స్మరించుకుంటూ కటక్ ఐపీఎస్ మెస్‌లో శనివారం సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ (ఇంఛార్జి) అరుణ్ కుమార్ షడంగి అధ్యక్షత వహించారు. ఈ సభలో రాష్ట్ర స్థాయిలు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొని మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి రాజీనామా

- తాత్కాలిక అధ్యక్షునిగా భుజబల్ మజ్జి



మున్నా త్రిపాఠి



కుమార్తె లిపికా మజ్జితో భుజబల్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా మనో రంజన్ త్రిపాఠి (మున్నా త్రిపాఠి) రాజీనామా చేశారు. శని వారం తన రాజీనామా లేఖను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి పంపించారు. దశాబ్ద కాలంగా తనను పదవిలో కొనసాగించినందుకు పార్టీకి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ కుటుంబం తరతరాలుగా కాంగ్రెస్‌లోనే కొనసాగిందన్నారు. ప్రస్తుతం తన కుమార్తే మానషా త్రిపాఠి రాష్ట్రంలోనే అతి చిన్న వయసున్న ఏఐసీసీ సభ్యురాలని గుర్తు చేశారు. అయితే తన రాజీనామాకు గల కారణాలు తెలియజేయలేదు. మున్నా సతీమణి కాదంబిని త్రిపాఠి గతంలో నబరంగ్‌పూర్ పురపాలక సంఘ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. కొంతకాలంగా మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు జగన్నాథ త్రిపాఠి కుటుంబాన్నికి చెందిన మున్నా రాజీనామాతో పీసీసీ తక్షణ చర్యలకు ఉపక్రమించింది. నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం మాజీ ఎమ్మెల్యే భుజబల్ మజ్జిని తాత్కాలిక డీసీసీ అధ్యక్షునిగా నియమించింది. జిల్లాలో మున్నాకు, భుజబల్‌కు విభేదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం భుజబల్ కుమార్తె డాక్టర్ లిపికా మజ్జి జిల్లా పరిషత్ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. రాబోయే ఎన్నికల్లో నబరంగ్‌పూర్ విధాన సభ స్థానం నుంచి లిపికా, లోక్‌సభ స్థానం నుంచి భుజబల్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది.

ఒడిశా తెలుగు వెలుగు చౌరాముల్లా



చౌరాముల్లా గ్రామంలో జరిగిన సంక్రాతి వేడుకల్లో ప్రసంగిస్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని, వేదిక మీద మంజుల మజ్జి, దేవాశిష్ పాత్రో

కొరాపుట్: రాష్ట్రంలో అచ్చమైన తెలుగు వెలుగు ఉండే గ్రామం చౌరాముల్లా అని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని అభివర్ణించారు. నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి చౌరాముల్లా గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తరతరాలుగా ఈ గ్రామం తెలుగు సంస్కృతిని కాపాడుతోందని అన్నారు. ఆంధ్రా సంస్కృతిని ప్రతిబింబిస్తూ ప్రతి ఇంటా తెలుగు ఆచార వ్యవహారాలు నడుస్తున్నాయన్నారు. సరిహద్దుకి వందల కిలోమీటర్ల దూరంగా ఉండే ఈ గ్రామంలో అత్యధిక జనాభా తెలుగు ప్రజలు ఉండడం ఆశ్చర్యకరమని అన్నారు. ప్రతి తెలుగు పండగను ఎంతో సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు మంజులా మజ్జి, బీజేడి పార్టీ ఉప పరిశీలకుడు దేవాశిష్ పాత్రో, జిల్లా పరిషత్ సభ్యుడు పింటు మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

19 అంతర్ నదీజలాశయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 19 అంతర్ నదీ జలాశయాల ప్రాజెక్టు పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల వ్యయ ప్రణాళిక రూ.4,600 కోట్లుగా ప్రకటించారు. బర్‌గడ్, బొలంగిర్, బౌధ్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కలహండి, కెంజొహర్, ఖుర్దా, పూరీ, సంబల్‌పూర్, సువర్ణపూర్, సుందర్‌గఢ్ జిల్లాల్లో ఈ ప్రాజెక్టులు నిర్మిస్తారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతులతో పాటు తాగునీటి సరఫరా, చేపల పెంపకం, పశు పోషణకు ప్రాజెక్టులు దోహదపడతాయని చెప్పారు. రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి, వరదల నియంత్రణకు కూడా ప్రాజెక్టులు దోహదపడతాయన్నారు. 2020లో రూ.11,700 కోట్లతో ఇన్ స్ట్రీమ్ స్టోరేజీ ప్లాజెక్టును ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఇప్పటి వరకు 3 దశల్లో 72 ప్రాజెక్టులకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అంతర్ నదుల చిత్తడి నేల ప్రాజెక్ట్ 5టీ చొరవలో చేపట్టిన ముఖ్య కార్యక్రమంగా పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంతోపాటు ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడంపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రజలెవరూ నిర్వాసితులు కారన్నారు. కాలియా యోజన, రైతులకు వడ్డీ లేని రుణ సౌకర్యం, పంటల బీమా ప్రీమియం చెల్లింపు వంటి పలు కార్యక్రమాలు రాష్ట్రంలోని రైతుల స్థైర్యాన్ని బలపరిచాయని తెలిపారు. రైతులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. బొలంగిర్‌లో పాల్గొన్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి టుకుని సాహు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. కేంద్రాపడా జిల్లా మహాకలపడాలో రాష్ట్ర ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి అతున్ సబ్యసాచి నాయక్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

క్లుప్తంగా

అత్యాచారం, కుల దూషణ కేసులో వ్యక్తికి జైలు

పార్వతీపురం టౌన్: అత్యాచారం, కులదూషణ కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఎస్సీ, ఎస్టీ నాల్గవ జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాష తీర్పును వెలువరించారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... పార్వతీపురం రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో గల గంగాపురం గ్రామానికి చెందిన బాధితురాలు 2019 సెప్టెంబర్ 16న పార్వతీపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తాను గంగాపురం గ్రామంలో తల్లిదండ్రులతో పాటు నివాసం ఉంటున్నానని, సుమారు 8 సంవత్సరాల క్రితం పులిగుమ్మి గ్రామానికి చెందిన పువ్వల పోలి అనే అతనితో వివాహం జరిగి ఒక కుమార్తె జన్మించిందని ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త తాగుడికి బానిసై సరిగ్గా చూడకపోవడంతో కన్నవారి ఇంటికి వచ్చి ఉంటున్నానని తెలిపింది. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన పిరిడి పోలి పరిచయమై రెండో భార్యగా స్వీకరించి తన కుమార్తెను సక్రమంగా చూసుకుంటానని నమ్మించి లోబరచి గర్భవతిని చేశాడని పేర్కొంది. 2019 ఆగస్టు 3న అబ్బాయి పుట్టగా సదరు విషయం చెప్పగా తాను చూడడానికి రాకపోవడంతో జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులతో, పెద్దలతో చెప్పి పంచాయతీ పెట్టగా విషయం తెలుసుకొని నేరస్తుడు గ్రామం విడిచి వెళ్లిపోయాడని తెలిపింది. ఈ విషయమై తనకు జరిగిన అన్యాయంపై ముద్దాయి తల్లిదండ్రులకు ప్రశ్నించగా వారు తనను కులం పేరిట దూషించడమే కాకుండా బెదిరించారని ఫిర్యాదు చేసింది. దీనిపై తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరింది. దీనిపై అప్పటి పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ వీరబాబు కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు రుజువు కావడంతో ముద్దాయి పిరిడి పోలికి పదేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

ఎవరిదో ఈ బైక్...!



రోడ్డు పక్కన ఉన్న ద్విచక్ర వాహనం

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల–రణస్థలం రహదారిలో తంగుడుబిల్లి సమీపంలో ఉన్న మామిడి తోటల వద్ద ఓ ద్విచక్ర వాహనం అనుమానాస్పదంగా ఉంది. సుమారు నెల రోజుల నుంచి రహదారి పక్కనే ద్విచక్ర వాహనం ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికుల్లో పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఎవరైనా బైక్‌ను దొంగలించి అక్కడ వదిలేసి వెళ్లిపోయారా? ప్రమాదానికి గురైందా? అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులు స్పందించి బైక్ ఎవరిదో గుర్తించాలని కోరుతున్నారు.

సారా పట్టివేత

సాలూరు: పట్టణంలోని భాష్యం స్కూల్ సమీపంలో సారా విక్రయిస్తున్న కాడేలు లక్ష్మి, రెడ్డి పాలకుమారిల నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జీడీ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. అలాగే గొల్లాది శ్రీను అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల సారా తరలిస్తూ డబ్బివీధి వద్ద పట్టుబడ్డాడన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గీత కార్మికులకు ఐడీ కార్డులు



కార్డులు అందజేస్తున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: గీత కార్మికులకు మంజూరైన ఐడీ కార్డులను జెడ్పీటీసీ రవికుమార్ శనివారం పంపిణీ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ద్వారా మండలంలో 30మంది గీత కార్మికులకు ఐడీ కార్డులు మంజూరయ్యాయి. కల్లుగీత కార్మికులలో వృత్తి చేసే వారికి 50సంవత్సరాలు దాటిన వారికి వీటిని మంజూరు చేస్తారు. అందులో భాగంగా 30మందికి మంజూరైనట్లు తెలిపారు. గలావల్లికి చెందిన తొమ్మిది మంది కార్మికులకు కార్డులను పంపిణీ చేశారు. కార్పొరేషన్ ద్వారా పథకాలు మంజూరైతే వీటి ద్వారా వారికి లబ్ధి చేకూరే అవకాశాలున్నాయని తెలిపారు. కొత్త పింఛను మంజూరుకు దీనిని వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కె.వెంకటరమణ, ఎ.పోలినాయుడు, ఎస్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో పైరుకు పోషణ



ఏడీ కె.రత్నకుమారి

పాలకొండ రూరల్: సేంద్రియ ఎరువులతో పంటల సాగు అన్ని రకాలుగా శ్రేయస్కరమని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి పేర్కొన్నారు. ప్రకృతి సాగు విధానంలో భాగంగా పచ్చిరొట్ట సాగుతో భూమికి కావాల్సిన పోషకాలు లభిస్తాయని, ఫలితంగా ఎరువుల వినియోగం, ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయన్నారు.

నేలలో నత్రజని స్థాపనం

పచ్చిరొట్టగా ఎకరాకు 12 కిలోల జనుమును విత్తితే 5 నుంచి 7 టన్నుల దిగుబడి వస్తుంది. అలాగే 40 కిలోల నత్రజని నేలకు అందుతుంది. ఎకరాకు 15 కిలోల జీలుగు విత్తితే ఐదు నుంచి ఏడు టన్నుల పచ్చిరొట్ట, 60 కిలోల నత్రజని పైరుకు అందుతుంది. ఎకరానికి 15 కిలోల అలసంద విత్తనాలు విత్తుకుంటే 3 టన్నుల పచ్చిరొట్ట, 35 కిలోల నత్రజని భూమికి లభిస్తుంది. 6 కిలోల పిల్లిపెసర ద్వారా 3 టన్నుల పచ్చిరొట్ట, 40 కిలోల నత్రజని లభిస్తుంది. ఎకరాకు 8 కిలోల పెసర విత్తనాలు విత్తుకుంటే మూడు టన్నుల పచ్చిరొట్ట, 25 కిలోల నత్రజని నేలలో నిలుస్తుంది. పెసరసాగు చేసి కాయకోత అనంతరం యాధాస్థితి పొలాన్ని దున్నుకుంటే ఆ వ్యర్థాలు బలవర్థక ఎరువుగా మారుతాయని వివరించారు. పచ్చిరొట్టపైరు నేలసారాన్ని, భౌతిక లక్షణాలను మెరుగుపరుస్తాయి. అలాగే తేమ నేలలో నిలిచే సామర్థ్యాన్ని గననీయంగా పెంచుతాయి. నేల కోతకు గురికాకుండా, మేలు చేసే సూక్ష్మజీవులను వృద్ధి చేస్తాయి. ఈ రకమైన సేంద్రియతను ముందస్తు ప్రణాళికతో సిద్ధం చేసుకోవటం వలన దిగుబడి పెంచుకోవచ్చు.



పచ్చిరొట్ట సాగు

తేమ ఉన్నప్పుడే కలియ దున్నాలి..

పచ్చిరొట్ట పైరును పూతదశలో నేలలో కలియ దున్నడం, నేలలో సరైన తేమ ఉన్న సమయంలో మాత్రమే ఈ తరహా విధానం చేపట్టడం శ్రేయస్కరం. నేలలో తేమ ఉన్నప్పుడు పచ్చిరొట్ట పైరుతో సహా కలిపి దున్నితే త్వరగా కుళ్లి భూ సామర్థ్యాన్ని పెంచుతుంది. పవర్ టిల్లర్ లేదా రోటావేటార్ సాయంతో నేలలో పచ్చిరొట్ట కలిసే విధంగా దున్నడం ఓ పద్ధతి. అలా దున్నిన అనంతరం 15 రోజుల వ్యవధిలో పైరు భూమిలో కుళ్లుతున్న సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్‌ఫాస్ఫేట్ ఎరువును చల్లడం ద్వారా మరింత లాభం పొందవచ్చు.

తప్పిపోయిన పిల్లల ఆచూకీ కోసం చర్యలు చేపట్టాలి

- రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

పార్వతీపురం టౌన్: తప్పిపోయిన పిల్లల ఆచూకీ కోసం చర్యలు చేపట్టాలని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. పార్వతీపురం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలు, మహిళలపై ప్రత్యేక దృష్టి సారించి విచారణ పక్కాగా చేయాలన్నారు. మహిళలను వివిధ మార్గాల్లో నమ్మించి మోసం చేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయని, వాటిపై నిఘా ఉండాలని సూచించారు. దేశ విదేశాలకు అక్రమ రవాణా వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడం అవసరమని ఆయన తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, శిక్షణ డీఎస్పీ ఎండీ అజీజ్, జిల్లాలో గల సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించాలి : పీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం టౌన్: పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు విధిగా ముందుగా సందర్శించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సాలూరు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై ఐటీడీఏ గిరమిత్ర సమావేశ మందిరంలో సంబంధిత తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులు విధిగా పోలింగ్ కేంద్రాలు సందర్శించాలని, అక్కడ మౌలిక సదుపాయాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. కనీస వసతులైన తాగునీరు, విద్యుత్, ర్యాంపు, మరుగుదొడ్లు తదితర వసతులు ఉండాలన్నారు. విద్యాశాఖ సంబంధిత పనులు చేపడుతుందని, సమన్వయం చేయాలని ఆయన సూచించారు. సెక్టార్ అధికారులు రూట్ పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

సీతానగరం: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని, ఆరోగ్యకరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు మానస, తిరుపతి, దేవీ ప్రసాద్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం ఆవరణలో బందలుప్పి రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తు(కూరగాయలు)ల ప్రదర్శనతో పాటు విక్రయాలను శనివారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న మానస, తిరుపతి, దేవీప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంతో పండించిన కూరగాయల పంటలు ప్రజలకు ఆరోగ్యకరమన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో పండించిన కూరగాయలను విస్తారంగా కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. దీంతో ప్రకృతి వ్యవసాయ పంట దినుసులకు మార్కెట్‌లో గిరాకీ ఎక్కువగా ఉన్నందున రైతులు ప్రకృతి వ్యవసాయ పంటల సాగుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. అలాగే పొలంలో తీసిన తాజాగా ఉన్న పంటను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడం వల్ల కొనుగోలుదారునికి, విక్రయదారునికి ఆర్థికంగా లాభపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, సీఆర్పీలు దానబాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



మన గ్రోమోర్ ఎరువుల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నిర్మలాజ్యోతి

సీతానగరం: మండల కేంద్రంలోని లైసెన్స్ పొందిన ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను జీఎల్‌పురం ఏడీఏ అలజంగి నిర్మలజ్యోతి, ఏఓ ఎస్.అవినాష్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న నిల్వలు, రికార్డుల్లో ఉన్న నిల్వలు, విక్రయించిన రికార్డుల్లో ఉన్న సరుకులను పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ స్టోరేజ్ ఎగ్రిమెంట్‌లు, జీఎస్టీ వివరాలు, బిల్లు బుక్‌ల వివరాలను షాపు యజమానులు సరిగా నిర్వహించాలని కోరారు. నిల్వల రికార్డులను పరిశీలించుకోవాలని కోరారు. గుర్తింపు పొందిన ఎరువుల కంపెనీల నుంచి కొనుగోలు చేసి రైతులకు పంపిణీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు పురుగుల మందులున్నట్లయితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

22న శ్రీరామ శోభాయాత్ర



శోభాయాత్ర వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ధార్మిక సంఘాల ప్రతినిధులు

విజయనగరం టౌన్: అయోధ్య శ్రీరామ మందిరంలో ఈ నెల 22న బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ఆ రోజు శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామకమిటీ నిర్వాహకుడు బర్ల రామారావు తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ధార్మిక సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామభద్రపురం నుంచి రామతీర్థం వరకు శోభాయాత్రను మూడు దశలలో నిర్వహిస్తామన్నారు. రామభద్రపురం అయ్యప్ప పీఠం గురుస్వామి శివస్వామి ఆధ్వర్యంలో 600 మంది భక్తులతో శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. రామభద్రపురం నుంచి ఆరికతోట వరకు, విజయనగరం, రామతీర్థంలలో మూడు దశలుగా శోభాయాత్ర ఉంటుందన్నారు. యాత్రలో పాల్గొనే భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. ఆరికతోట నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రామతీర్థం సేవా పరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ, పలు ధార్మిక సంఘాల సహకారంతో విజయనగరం పట్టణంలో కోట నుంచి మూడు లాంతర్లు, ఫూల్‌బాగ్ అయ్యప్పస్వామి కోవెల వరకు శోభాయాత్ర సాగుతుందన్నారు. అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో వాడవాడలా పండగ వాతావరణం నెలకొనేలా సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రామతీర్థం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దాట్ల చిట్టిరాజు మాట్లాడుతూ, 22వ తేదీ సాయంత్రం ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలన్నారు. శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హిందూ ధర్మ రక్షా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వేణుగోపాల్, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు లక్ష్మణ, శ్రీరామ కమిటీ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

22న అఖండ శ్రీరామతారక మంత్ర భజన

విజయనగరం టౌన్: అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో స్థానిక టీటీడీ ఆవరణలో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అఖండ శ్రీరామ తారక మంత్ర భజన ఉంటుందని ఆలయ ప్రధానార్చకుడు పీవీ నరసింహాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి కల్యాణ మహోత్సవం, పుష్పయాగం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు. అదేవిధంగా స్థానిక కంటోన్మెంట్ ఆర్టీసీ కాలనీ పార్కు వద్ద నుంచి ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5 వరకు శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆర్టీసీ కాలనీ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

శోకసంద్రం

- అమెరికాలో మృతి చెందిన తెలుగు విద్యార్థి
- స్వగ్రామం చేరిన మృతదేహం



మృతి చెందిన సాయి నికేష్ (ఫైల్)

పాలకొండ: ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లిన పాలకొండకు చెందిన ఓ విద్యార్థి విగతజీవిగా సొంతూరుకు శనివారం చేరాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో పాలకొండ శోకసంద్రమైంది. చదువే లోకంగా జీవించిన ఆ విద్యార్థి కలలు కల్లలయ్యాయి. తమ బిడ్డపై ఆ తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... పాలకొండలోని బట్టి మఠం కాలనీలో రాకోటి వెంకటరమణ, ఆదిలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు రాకోటి సాయినికేష్(21), కుమార్తె లేఖ ఉన్నారు. సాయినికేష్ ఇటీవల ఇంజినీరింగ్ పూర్తి చేసి ఎంఎస్ కోసం గత నెల డిసెంబర్ ఆఖరులో అమెరికా వెళ్లాడు. హర్ట్‌ఫోర్డు సిటీలో సేక్రెడ్ యూనివర్సిటీలో సీటు రావడంతో అక్కడ ఎంఎస్‌లో చేరాడు. అమెరికా వెళ్లిన 15 రోజుల్లోనే ఈ నెల 12న శుక్రవారం తాను ఉంటున్న గదిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. సాయినికేష్‌తో పాటు అదే గదిలో ఉంటున్న తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన మరో తెలుగు విద్యార్థి కూడా మృతి చెందాడు. విష వాయువు పీల్చడంతోనే వీరిద్దరు మృతి చెందినట్టు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శనివారం సాయినికేష్ మృతదేహం ఇక్కడకు రాగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా తమ బిడ్డ మృతికి పూర్తి కారణాలు తెలియడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయినికేష్ మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన సహచర విద్యార్థులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటనతో పాలకొండ పట్టణంలో విషాదం అలముకుంది.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ రవీంద్రకుమార్

వీరఘట్టం: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పాలకొండ ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పనసనందివాడ గ్రామంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన 35 మంది యువత రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొరికాన సన్యాసినాయుడు, కుసిమి, అన్నవరం, బిటివాడ ఆస్పత్రుల వైద్యాధికారులతో పాటు పాలకొండ ఏరియా ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

ఆడపిల్లల పట్ల వివక్ష కూడదు : డీఎంహెచ్‌ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం తగదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరని సమానంగా పెంచాలన్నారు. బాలికలు తమ హక్కులు గురించి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం బాలికల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందన్నారు. ఆడ పిల్లలను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. ఆడపిల్లలు లేనిదే సమాజం లేదన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ ఆర్.అచ్చుతకుమారి, డెమో చిన్నతల్లి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి, చదలవాడ ప్రసాద్, దిశ ఎస్‌ఐ నారాయణరావు, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నాక్ గుర్తింపులో పరిశోధన పత్రాలు కీలకం



అధ్యాపకులకు సూచనలు చేస్తున్న సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు దోహదపడతాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో పరిశోధన, పరిశోధనా పత్రాల తయారీ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఇదే ఒరవడిని కొనసాగించాలన్నారు. ప్రతి అధ్యాపకుడు పరిశోధనా పత్రాల తయారీలో పాల్గొని వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మొత్తం 35 పరిశోధనా పత్రాలు సిద్ధం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ విజయ్‌బాబు, ఐక్యూఏసీ డీన్ ప్రొఫెసర్ రమణారావు, డీన్లు ఎంఎల్ఎన్ ఆచార్యులు, సన్నీ డియోల్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు

సీతానగరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచిందని వీటిని వినియోగించడం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా నివారణాధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానంతో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రులకు వివిధ రకాల కారణాలతో అనారోగ్యానికి గురైన వారు రోగ నివారణకు వచ్చిన వారికి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత మందులు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వినియోగించేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. డాక్టర్ పావని, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

శంబర జాతరకు చకచకా ఏర్పాట్లు

- ఈ నెల 22, 23, 24 తేదీల్లో శంబర జాతర
- ఏర్పాట్లు పూర్తిచేస్తున్న అధికార యంత్రాంగం
- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ సునిల్ సొరేన్
- చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌ను పరిశీలించిన జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు



శంబర పోలమాంబ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరగనుంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా దేవదాయ శాఖ అధికారి ప్రసాదరావు, ఏఎస్పీ సునీల్‌సొరెన్ పరీక్షించారు. చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తాగునీరు, పిల్లలకు పాలు, ప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై ఆరా తీశారు. శంబర జాతరను రాష్ట్రజాతరగా ప్రభుత్వం గుర్తించిందని, లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉందని,



క్యూ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు, ఈఓ సూర్యనారాయణ తదితరులు



సిద్ధమైన క్యూలైన్



జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏఎస్పీ సునీల్‌సొరెన్

అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సిరిమానోత్సవానికి పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు.

జాతరకు పటిష్టబందోబస్తు

పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ సునీల్‌సొరెన్ శంబర గ్రామానికి చేరుకొని జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, క్యూకాంప్లెక్స్‌లను పరిశీలించారు. జాతరలో బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ నరసింహమూర్తితో చర్చించారు. జాతరలో సుమారు 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్టు సీఐ ధనుంజయరావు తెలిపారు. 44 చోట్ల సీసీ కెమెరాలు అమర్చామన్నారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను కేటాయించామని చెప్పారు. సిరిమాను రథాన్ని నడిపే భక్తుల పేర్లు సోమవారం అందిస్తామని చెప్పగా, 50 మందికి మించరాదని ఏఎస్పీ సూచించారు.



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న వలస పక్షులు

తిరుగు ప్రయాణం

సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు చేరుకున్న వలసపక్షులు, విద్యార్థులు తిరుగుప్రయాణమయ్యారు. వీరి రాకతో ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. విద్యా సంస్థలు సోమవారం నుంచి పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో శనివారమే విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు బయలుదేరారు. – సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



ఇదిగో వస్తున్నా...